క్లుప్తంగా

సామగ్రి దహనంపై ఫిర్యాదు



దహనమైన వస్తువులు

ఎంవీపీ కాలనీ: పెదవాల్తేర్‌లో ఓ ఇంటి ఆవరణలో ఉన్న సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేయడంపై బాధిత యజమాని పాలయ్యరెడ్డి ఎంవీపీ కాలనీ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఇంటికి ఉన్న విద్యుత్ కనెక్షన్‌ను కట్ చేయడంతో పాటు ఎలక్ట్రికల్ మీటర్‌ను, బోర్ వెల్ కనెక్షన్ ప్లగ్స్, ఇంటి గోడపై ఉన్న పలు వస్తువులను ధ్వంసం చేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై సీఐ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలోఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహాధర్నా విజయవంతానికి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణరాజు తదితరులు

ఎంవీపీ కాలనీ: ఈ నెల 10న తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సర్పంచులకు ఇస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించడాన్ని నిరసిస్తూ ధర్నా చేయనున్నామని తెలిపారు. ఎన్నికల హామీలో భాగంగా సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు మేడిపాటి రవీంద్ర, పార్వతీపురం ఇన్‌చార్జి ప్రకాష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గద్దర్‌కు వీఎఫ్‌ఎస్ ఘన నివాళి



గద్దర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న వీఎఫ్‌ఎస్ సభ్యులు

ఏయూ క్యాంపస్: ప్రజా గాయకుడు గద్దర్ మృతికి వైజాగ్ ఫిలిం సొసైటీ(వీఎఫ్‌ఎస్) సంతాపం వ్యక్తం చేసింది. మంగళవారం ఏయూ మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సంతాప సభ నిర్వహించారు. ముందుగా గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. వామపక్ష ఉద్యమాలను తమ పాటతో ఉత్తేజితం చేసిన గద్దర్ గేయాలను, గళాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. గద్దర్ కుటుంబ సభ్యులకు వీఎఫ్‌ఎస్ తరఫున ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వీఎఫ్‌ఎస్ అధ్యక్షుడు ఆచార్య ఎస్.ఎ.డి. పాల్, కార్యదర్శి నరవ ప్రకాశరావు, బి.చిన్నారావు, డాక్టర్ బాబ్జీ, కాశీ విశ్వేశ్వరరావు, కృష్ణారావు, డాక్టర్ అర్చన, తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి అష్టపద్మ కుండాత్మక అష్టలక్ష్మీ మహాయాగం

సీతంపేట: అక్కయ్యపాలెంలోని శ్రీలలితా పీఠంలో ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు అష్టపద్మ కుండాత్మక అష్టలక్ష్మీ మహాయాగం నిర్వహించనున్నట్టు కుర్తాళ పీఠం ఆస్థాన పండితుడు మాచవోలు రమేష్‌శర్మ తెలిపారు. మంగళవారం పీఠంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడా రు. దేశంలోనే మొదటిసారిగా అష్టలక్ష్మీ యాగంతో పాటు అష్టలక్ష్మీ వైభవం కూడా నిర్వహిస్తామన్నారు. అష్టలక్ష్మీ వైభవంలో మహాలక్ష్మి అమ్మవారితో పాటు ఎనిమిది రూపాల్లో అష్టలక్ష్మిలను స్థాపన చేసి రోజూ ఉదయం దేవతలకు హోమం, స్వర్ణ పుష్పార్చన, సాయంత్రం అష్టలక్ష్మీ అమ్మవార్లకు విశేష అర్చన, దర్బారు సేవ నిర్వహిస్తామని తెలిపారు. 16వ తేదీ సాయంత్రం 6 గంటలకు పీఠంలో అష్టలక్ష్మి కల్యాణం జరుగుతుందన్నారు. అధిక మాసంలో చేసే పూజలకు అధిక ఫలితం లభిస్తుందని శ్రీమహావిష్ణువు సాక్ష్యాత్తు లక్ష్మీదేవికి చెప్పినట్టు పురాణాల్లో ఉందన్నారు. అనంతరం యాగం వివరాలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు.

చంద్రబాబుతో శాంతిభద్రతలకు విఘాతం

- వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని ధ్వజం
- పుంగనూరులో పోలీసులపై దాడికి నిరసన
- ఇసుకతోట కూడలి వద్ద మానవహారం



ఇసుకతోట కూడలి వద్ద నిరసన తెలుపుతున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, వైఎస్సార్‌సీపీ తూర్పు శ్రేణులు

మద్దిలపాలెం: సంక్షేమాంధ్రప్రదేశ్‌గా వెలుగొందుతున్న రాష్ట్రంలో శాంతి భద్రతలకు చంద్రబాబు విఘాతం కలిగించి పబ్బం గడుపుకోవాలని కుట్రలు చేస్తున్నారని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల ధ్వజమెత్తారు. పుంగనూరులో పోలీసులపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్పడిన దాడికి నిరసనగా మంగళవారం ఇసుకతోట కూడలి వద్ద అక్కరమాని విజయనిర్మల ఆధ్వర్యంలో తూర్పు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున మానవహారం నిర్వహించారు. చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. అనంతరం చంద్రబాబు ఫ్లెక్సీని ఊరేగించారు. ఈ సందర్భంగా అక్కరమాని మాట్లాడుతూ వచ్చే సాధారణ ఎన్నికల్లో గెలిచే అవకాశాలు లేవని తెలుసుకున్న చంద్రబాబు రాష్ట్రంలో అల్లకల్లోలం సృష్టించడానికి పావులు కదుపుతున్నారని విమర్శించారు. చంద్రబాబుతో పాటు, పవన్ కల్యాణ్, లోకేష్‌లు కలిసి రాష్ట్రంలో అల్లర్లు సృష్టించడానికి కుతంత్రాలు పన్నుతున్నారని ఆరోపించారు. అధికారంలోకి వస్తే ప్రజలకు ఏం చేస్తారో చెప్పకుండా రెచ్చగొట్టే ప్రసంగాలతో సరిపెట్టేస్తున్నారన్నారు. పుంగనూరులో హింసను ప్రేరేపించడమే కాకుండా లా అండ్ ఆర్డర్‌ను సవ్యంగా నిర్వహిస్తున్న పోలీసులపై దాడి చేసి, రక్తం కారేలా రాళ్లతో కొట్టారన్నారు. ఇదేనా ప్రజలకు మీరిచ్చే సందేశం అని ఆమె ప్రశ్నించారు. దెబ్బలు తిన్న పోలీసులు ఎంతో సంయమనం పాటించారని, అదే ఏమాత్రం తిరిగి పోలీసులు చర్యలకు దిగితే దాని వల్ల కలిగే నష్టాన్ని చంద్రబాబు క్యాష్ చేసుకోవాలని చూశారన్నారు. దీన్ని పోలీసులు తిప్పికొట్టారని ఆమె అభినందించారు. ఇటీవల సీఐ అంజు యాదవ్ జనసేన వీధి గూండాపై చేయి చేసుకుంటే రంకెలేసిన పవన్ కల్యాణ్ పోలీసులను రక్త కారేలా కొట్టిన సంఘటనపై ఎందుకు నోరూ విప్పలేదని అక్కరమాని ప్రశ్నించారు. వీధి రౌడీలు కూడా మాట్లాడని భాషను 40 ఇయర్స్ పొలిటీషియన్ చంద్రబాబు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన చూసి ఓర్వలేక మతిభ్రమించి చంద్రబాబు అండ్ గ్యాంగ్ చేస్తున్న కుట్రలు, కుతంత్రాలు ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారన్నారు. ఈసారి ఇచ్చే తీర్పుతో చంద్రబాబు అడ్రస్ గల్లంతు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి మొల్లి అప్పారావు, కార్పొరేటర్లు అక్కరమాని రోహిణి, కెల్లా సునీత, గేదెల లావణ్య, ముర్వ్వలక్ష్మి, పార్టీ వార్డు ఇన్‌చార్జులు జగ్గుపల్లి అప్పలరాజు, పల్లా దుర్గారావు, గేదెల నాగరాజు, మువ్వల సురేష్, పుక్కెళ్ల ధనలక్ష్మి, శంకర్, సూరాడ వెంకటలక్ష్మి, దాసు, విశాఖ జిల్లా మహిళా అధ్యక్షురాలు నల్లా కృపజ్యోతి, రామన్నపాత్రుడు, భోని శివరామకృష్ణ, పీలా వెంకట్, మోహనరావు, బొండా ఉమా, పలికెల నీలారెడ్డి, కారి శ్రీలక్ష్మి, వాసుపల్లి ఎల్లాజీ, ఉమ్మడి కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కని '69' సిటీ బస్సులు



గతంలో నడిపిన 69 నంబరు సిటీ బస్సు

ఆరిలోవ: రైల్వే స్టేషన్ నుంచి ఆరిలోవ కాలనీకి తిరిగే సిటీ బస్సులు కొద్ది రోజులుగా రోడ్డక్కడం లేదు. ఆర్టీసీ అధికారులు నాలుగు నెలల క్రితం పలు బస్సులను నిలిపేయగా, సుమారు నెల రోజులుగా మిగతా అన్ని బస్సు సర్వీసులను ఆపేశారు. ఆరిలోవ కాలనీ ఏర్పడినప్పటి నుంచి ఆర్టీసీ అధికారులు సిటీ బస్సులు నడుపుతున్నారు. ఆరిలోవ కాలనీ నుంచి పాత పోస్టాఫీస్‌కు, రైల్వే స్టేషన్‌కు పదుల సంఖ్యలో సర్వీసులు ఉండేవి. వాల్తేరు డిపో నుంచి '60 సి'నంబరు బస్సులు ఆరిలోవ కాలనీ నుంచి పాత పోస్టాఫీస్‌కు, మద్దిలపాలెం డిపో నుంచి '69'నంబరు గల బస్సులు ఆరిలోవ కాలనీ నుంచి రైల్వే స్టేషన్‌కు ఆరు బస్సులను ప్రతి 20 నిమిషాలు, అర గంట వ్యవధిలో నడిపేవారు. ఇప్పుడు 69 నంబరు బస్సులను పూర్తిగా ఆపేశారు. దీంతో ఆరిలోవ, తోటగరువు, రవీంద్రనగర్, ఆదర్శనగర్, కొండవాలులో దీన్‌దయాల్‌పురం, చినగదిలి, పెదగదిలి, హనుమంతవాక తదితర ప్రాంతాల ప్రజలు రైల్వే స్టేషన్‌కు వెళ్లడానికి ఇబ్బందిపడుతున్నారు. రైల్వే స్టేషన్‌కు వెళ్లాలంటే ఆటోలు, ట్యాక్సీలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ నంబరు గల సిటీ బస్సులు ఆరిలోవ నుంచి వెంకోజీపాలెం, ఇసుకతోట మీదుగా హెచ్‌బీ కాలనీ, సీతమ్మధార, సీతమ్మధార రైతుబజార్, సత్యం జంక్షన్, గురుద్వార, ఆర్టీసీ కాంప్లెక్స్, డాబాగార్డెన్స్ కూడలి మీదుగా అల్లిపురం నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్తుండేవి. ఆయా ప్రాంతాలకు వెళ్లాల్సిన వారికి ఈ సర్వీసులు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. ఇప్పుడు అటుగా వెళ్లాల్సిన వారంతా ఆటోలను ఆశ్రయించక తప్పడం లేదు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి 69 సిటీ బస్సులను యథావిధిగా పునరుద్ధరించాలని ఆరిలోవ వాసులు కోరుతున్నారు.

ఎన్‌ఎంయూఏ రిలే దీక్షలు ప్రారంభం



మద్దిలపాలెం డిపో వద్ద రిలే దీక్షలు చేస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

మద్దిలపాలెం: తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రజా రవాణా శాఖ విశాఖ స్టీల్‌ప్లాంట్ డిపో వద్ద కార్మికులు చేపట్టిన దీక్షలు 25 రోజులుగా కొనసాగుతున్నాయి. ఇప్పటికీ యాజమాన్యం స్పందించకపోవడంతో మద్దతుగా మద్దిలపాలెం డిపో వద్ద రెండు రోజుల రిలే నిరాహార దీక్షలను నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ డిపో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ నిరంకుశంగా వ్యవహరిస్తూ సిబ్బందిని ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి పి.వి.వి.మోహన్, కార్యదర్శి పి.పి.ఎం.రాజు, జోన్-1 కార్యదర్శి ఎం.వి.ఆర్.మూర్తి, మద్దిలపాలెం డిపో కార్యదర్శి చిన్నారావు, ప్రెసిడెంట్ ఎం.ఈశ్వరరావు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



బాలింతలకు గుడ్లు, పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న అక్కరమాని విజయనిర్మల



మహిళలకు పోషకాహారం కిట్ అందిస్తున్న కార్పొరేటర్ ముర్వ్వల లక్ష్మి

ఎంవీపీ కాలనీ: గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల తెలిపారు. 19వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన తల్లిపాల వారోత్సవాలలో మంగళవారం ఆమె మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గర్భిణులు, బాలింతలతో పాటు పిల్లలకు అందించే పౌష్టికాహారంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. నిత్యం ఆశా వర్కర్ల ద్వారా వారి ఆరోగ్యంపై పర్యవేక్షణ చేస్తోందన్నారు. మహిళల్లో రక్తహీనతను తగ్గించేందుకు ప్రత్యేక పౌష్టికాహారాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు. తల్లిపాల ద్వారానే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందనే విషయాన్ని ప్రతి తల్లి గుర్తుంచుకోవాలని సూచించారు. అనంతరం బాలింతలకు గుడ్లు, పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టి

ఏయూ క్యాంపస్: మహిళల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని స్థానిక 20వ వార్డు కార్పొరేటర్ ముర్వ్వల లక్ష్మి తెలిపారు. మంగళవారం వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన తల్లిపాల వారోత్సవాలలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పోషకాహార కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ముర్వ్వల లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.


శ్రావణ సంగీతోత్సవాలు ప్రారంభం



కూచిపూడి నృత్యాలతో అలరిస్తున్న యువతులు

ఎంవీపీ కాలనీ: శ్రీవేంకటేశ్వరస్వామి శ్రావణ సంగీతోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. విశాఖ సాగరతీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ సంగీతోత్సవాలు ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం వేదికగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం కిరణ్మయి నృత్యాలయ విద్యార్థినులు నాట్యమయూరి జీవన కిరణ్మయి నృత్య దర్శకత్వంలో అన్నమాచార్య, రామదాసు కీర్తనలతో కూడిన భక్తిగీతాలకు కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేసి అలరించారు. కార్తీక దీపోత్సవ కమిటీ ప్రతినిధి హిమాంశు ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 12, 13వ తేదీల్లో విద్యార్థులకు డ్రాయింగ్, కీర్తనలు, కథల పోటీలు జరుగుతాయన్నారు. 15వ తేదీ విద్యార్థులకు బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేస్తామన్నారు. దివంగత డాలర్ శేషాద్రిని స్మరిస్తూ డాలర్ ఆకృతిలో బహుమతులు ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రతి రోజు రాత్రి 8.30 గంటలకు హారతి, ప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

దిగివచ్చిన టమాటా ధరలు



నరసింహనగర్ రైతుబజార్‌లో విక్రయానికి ఉంచిన టమాటా

సీతంపేట: సుమారు నెలరోజులు పాటు ఆకాశాన్నంటిన టమాటా ధరలు ఎట్టకేలకు దిగివచ్చాయి. నరసింహనగర్ రైతుబజార్‌లో మంగళవారం ఒక రకం టమాటా కిలో రూ.84, చిన్న రకం టమాటా కిలో రూ. 60లకు విక్రయించారు. గత నెలలో రైతు బజార్‌లో కిలో రూ.130కి, బహిరంగ మార్కెట్‌లో కిలో 200 వరకు ధర పలికింది. పెరిగిన ధరలతో వినియోగదారులు బెంబేలెత్తిపోయారు. ధరల నియంత్రణకు ప్రభుత్వ ఆదేశాలతో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ రైతుల నుంచి టమాటాలు సేకరించి సబ్సిడీ ధరపై కిలో రూ.50 చొప్పున విక్రయాలు చేపట్టింది. దీంతో కొంతవరకు ధరలు అదుపులోకి రాగా, ఇటీవల చిత్తూరు జిల్లా మదనపల్లి మార్కెట్‌కు టమాటా సరుకు పెద్దఎత్తున రావడంతో ఒకేసారి ధర తగ్గుముఖం పట్టింది. ధర ఒకేసారి తగ్గడంతో వినియోగదారులు సంతోషం వ్యక్తం చేశారు. బజారుకు 70 క్రేట్ల టమాటా రావడంతో జోరుగా విక్రయాలు జరిగాయి. మరో వారం రోజుల్లో క్రమేణా ధర తగ్గే అవకాశం ఉందని బజారు ఎస్టేట్ ఆఫీసర్ పి.చినబాబు తెలిపారు.

అలరించిన సంగీత విభావరి

సీతంపేట: శివసాయి సినీ సంగీత సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక పౌరగ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్ మూర్తి, సంస్థ వ్యవస్థాపకుడు వి.ఎం. గోపాలరావు, ప్రముఖ వ్యాఖ్యాత రాజేంద్ర ప్రసాద్, సంఘ సేవకులు రమణమూర్తి గాయనీ గాయకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. పల్లెకు పోదాం పారును చూద్దాం పేరిట నిర్వహించిన విభావరిలో గాయనీగాయకులు శివసాయి గోపాలరావు, వి.బంగారాజు, మహ్మద్ ఖాన్, బొమ్మిడి సత్యనారాయణ, విజయ్‌కుమార్, గోపాలరావు, శ్యామ్ సుందర్, పి.రాము, ఎం.కనకారావు, నాగు, మహదేవమూర్తి , రాధ, లక్ష్మి, సాత్విక, వాసంతి, శ్వేత, మాధురి, జాస్మిన్ తదితరులు ట్రాక్స్‌పై గానం చేసి ప్రేక్షకులను మెప్పించారు.

చికిత్స పొందుతూ క్షతగాత్రుడి మృతి

బీచ్ రోడ్డు: రోడ్డు ప్రమాదంలో ఈ నెల 5న తీవ్ర గాయాలు పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు సోమవారం రాత్రి మరణించాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డాబాగార్డెన్స్‌కు చెందిన నవీన్(21) తన స్నేహితులతో కలిసి 5న అర్ధరాత్రి పెట్రోల్ కోసం స్పెన్సర్ దగ్గర ఉన్న పెట్రోల్ బంకుకు వెళ్లాడు. ఆ సమయంలో రోడ్డు క్రాస్ చేస్తున్న నవీన్‌ను ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో నవీన్ సోమవారం రాత్రి మరణించినట్టు పోలీసులు తెలిపారు.

విచారణ పేరుతో బాలల నిర్బంధం తగదు



సీఐ శ్రీనివాసరావుతో చర్చిస్తున్న రాష్ట్ర బాలల కమిషన్ సభ్యులు గొండు సీతారాం

సీతమ్మధార: బాలలను వివిధ కేసుల్లో అదుపులోకి తీసుకుని విచారణ పేరిట రోజుల తరబడి అరెస్ట్ చూపకుండా పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడం తగదని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. ఓ కేసులో ఏడుగుర్ని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చూపకుండా రోజులు తరబడి వారిని కస్టడీలో ఉంచుకున్నట్లు సమాచారంతో సుమోటాగా తీసుకున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం మంగళవారం నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ వెంకటరావుతో కలిసి స్టేషన్‌ను పరిశీలించారు. ఏడుగురు నిందితుల్లో ఉన్న ఐదుగురు బాలలతో మాట్లాడారు. ఏ కేసులో ఎన్ని రోజుల క్రితం స్టేషన్‌కు తీసుకువచ్చారు.. పోలీసులు బెదిరింపులకు పాలపడ్డారా? లాఠీచార్జి చేశారా? అని సీతారాం ఆరా తీశారు. పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలు, వారి తల్లిదండ్రులు, పోలీసులు చెబుతున్న విషయాలకు పొంతన లేకపోవడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే వారిని జేజేబీ కోర్టు ముందు హాజరుపరిచి నివేదికను కమిషన్‌కు సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు సూర్యనారాయణ, డీపీవో శరత్, జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేష్, పీవోఐసీ మమత, లీగల్ కం ప్రొబేషన్ అధికారి అనీజ, 1098 చైల్డ్‌లైన్ ప్రతినిధి శారదా, బి.శకుంతల, పి.శేఖర్, లవకుశ, హరీష్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఈ కేసులో మొత్తం ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. ఐదుగురిని జువైనల్ హోంకి, ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు.

ఏయూ సమాచారం

కాలానుగుణంగా నైపుణ్యాలు పెంపు అవసరం



రిసోర్స్ పర్సన్స్‌ని సత్కరిస్తున్న కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించుకోవాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఏయూ డీసీఎంఎస్ విభాగంలో మేక్ యువర్ సెల్ఫ్ కార్పొరేట్ రెడీ అంశంపై నిర్వహించిన ప్రత్యేక శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పుస్తక జ్ఞానంతో పాటు, సాఫ్ట్‌స్కిల్స్, వ్యక్తిత్వం, వ్యవహార శైలి వంటివి ఉద్యోగ సాధనలో ఎంతో కీలకమన్నారు. ఉద్యోగం నిమిత్తం ఇంటర్వ్యూకు వెళ్లే సమయంలో ఆ సంస్థకు సంబంధించిన వివరాలపై అవగాహన ఉండాలని సూచించారు. రూబికన్ సంస్థ ప్రతినిధులు అమర్ నాగేంద్ర, పల్లవి, కోమలి మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం అతిథులను విభాగం తరపున సత్కరించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, ప్లేస్‌మెంట్ అధికారి వి.ఆర్.రెడ్డి, మోహన్‌గణేష్, విభాగ ఆచార్యులు ఎస్.సాంబశివరావు, ప్రభాకర్, బి.సుబ్బయ్య, రంజిత్, సెరస్స్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిజం విద్యార్థులకు దిశానిర్దేశం



జర్నలిజం విభాగ విద్యార్థులతో వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం విద్యార్థులకు వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి దిశానిర్దేశం చేశారు. మంగళవారం తన కార్యాలయంలో విద్యార్థులతో మాట్లాడారు. మీడియా రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకతను పలు ఉదాహరణలతో వివరించారు. జర్నలిజం కోర్సును పూర్తిచేసే సమయానికి జ్ఞానంతో పాటు ప్రత్యక్ష అవగాహన కలిగి ఉండాలన్నారు. జర్నలిజం విభాగం నుంచి నూతన స్టార్టప్ సంస్థలు రావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఏయూ నుంచి ప్రచురితమవుతున్న వార సంచిక ఏయూ లుక్స్ తీర్చిదిద్దడంలో యువత తమ ఆలోచనలు పంచుకోవాలని సూచించారు. విద్యార్థులు నిత్యం కొంత సమయాన్ని కేటాయిస్తూ ఏయూ లుక్స్ విస్తరణలో భాగం కావాలని ఆహ్వానించారు. విదేశీ విద్యార్థుల భాగస్వామ్యం సైతం ఎంతో కీలకమన్నారు. ఏయూ లుక్స్ సంచిక వేలాది మందికి చేరువవుతోందని, రానున్న కాలంలో మరిన్ని మార్పులు తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ వినయ్‌కుమార్, మీడియా రిలేషన్స్ డీన్ ఆచార్య చల్లా రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులతోనే సామాజిక మార్పు



శిక్షణ పూర్తి చేసిన అధ్యాపకులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: సమాజంలో మంచి మార్పులు తీసుకువచ్చే శక్తి అధ్యాపకులకు ఉందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఏయూ హెచ్‌ఆర్‌డీసీ కేంద్రంలో నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక అభివృద్ధికి దోహదకారిగా అధ్యాపకులు నిలవాలన్నారు. వైవిధ్యమైన జ్ఞానాన్ని కళాశాలలో విద్యార్థులకు అందించే ప్రయత్నం చేయాలన్నారు. విద్యార్థిలోని లోపాలను ఎత్తి చూపకుండా, వారిని సరిదిద్ది తగిన మార్గదర్శకం అందించేలా ఉండాలని సూచించారు. భారత్ విశ్వగురువుగా ఆవిర్భవించాలని ప్రధాని మోదీ ఆశిస్తున్నారని, ఈ దిశగా యువతను తీర్చిదిద్దే బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్‌లో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ సమాజంతో అనుసంధానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్‌డీసీ కేంద్రం సంచాలకుడు ఆచార్య టి.వి.కృష్ణ, ఆచార్య ఎస్.ఎ.డి.పాల్, తదితరులు పాల్గొన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న 21 మంది అధ్యాపకులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

రాహుల్‌పాల్‌కు ఏయూ డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి నిట్ల రాహుల్‌పాల్‌కు డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు ఎస్.పల్లంశెట్టి పర్యవేక్షణలో ఎ ఫ్రేం వర్క్ టు ది పెరఫార్మెన్స్ ఆఫ్ సిక్స్‌లో డబల్యూ పాన్ ఫర్ ఐవోటీ యూజింగ్ సాఫ్ట్ కంప్యూటింగ్ టెక్నిక్స్‌ అంశంపై జరిపిన పరిశోధనకు ఆయనకు డాక్టరేట్ వచ్చింది. ఈ మేరకు డాక్టరేట్ ఉత్తర్వులను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి నుంచి రాహుల్‌పాల్ స్వీకరించారు. ఈ సందర్భంగా రాహుల్‌ను విభాగ ఆచార్యులు, పరిశోధకులు అభినందించారు.

డీజీఆర్ అధికారి సందర్శన



కమాండర్ యువరాజును సత్కరిస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని డైరెక్టర్ జనరల్ ఆఫ్ రీ సెటిల్‌మెంట్ అధికారి కమాండర్ యువరాజు సందర్శించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌తో వివిధ అంశాలపై చర్చించారు. రక్షణ రంగాల ఉద్యోగులు నూతన ఉపాధి అవకాశాలు పొందేలా ఏయూ అందిస్తున్న సరిఫికెట్ కోర్సులు దోహదపడతాయన్నారు. త్వరలో 1000 మందికిపైగా రక్షణ రంగాల సిబ్బంది ఏయూలో శిక్షణకు హాజరవుతారన్నారు. అనంతరం ఏయూలో నిర్వహిస్తున్న పీఆర్‌సీ తరగతులను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏయూ సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏయూ తరపున యువరాజును సత్కరించారు.

పాఠశాలకు గ్రీన్ బోర్డుల వితరణ

బీచ్ రోడ్డు: అన్నమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ గెద్దాడ పద్మజ ఆరిలోవ ప్రాథమిక పాఠశాలకు మూడు గ్రీన్ బోర్డులను మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ డైరెక్టర్ మోహన్‌రావు, హెచ్‌ఎం సామరాజులు, పీఎంసీ చైర్‌పర్సన్ ఆంధ్ర సంతోషి, తదితరులు పాల్గొన్నారు.